ఆ పాకకు నిట్రాడి లేదు. రెండుప్రక్కల కాళీగుంజలపైన అడ్డంగావేసిన లావుపాటి బొంగుమీంచి క్రిందికి జారిన వెదురు తుంటెలమీద పడేసిన తాటాకులు ఆ పాకకు ఆకారం ఇచ్చాయి. లోపల చినిగిన చాపతుంపుమీద బాచిపట్లువేసుక్కూర్చున్నాడు రాంకోటి.

మోకాళ్లదాకావున్న కాకీనిక్కరు ఉండవలసిందానికంటే వదులుగా వుంది. పైన ఉన్నది చొక్కా కాదు. కురుచచేతులు జబ్బలుదాకా కూడ రాలేదు ముతకబట్ట. బన్నీను కాదు. దానికంటే పెద్దది. మిషన్‌మీద కుట్టించిందే! శ్లాక్‌లాగా లేదు కుదిమట్టంగా నడుందాకా వుంది. నిక్కరుజేబులు కూడా మూయ లేదు, ఆ గుడ్డ బన్నీనువంటి చొక్కా!

ఎడంచేతిప్రక్క క్రిందిభాగంలో లోపలవైపునున్న జేబులోంచి రాంకోటి పొగాకుకాడ తీశాడు. అంతా బారుగా చుట్టుకుపోయివున్న దాన్ని వెడల్పు చేశాడు. మొదట్లో పట్టుకొని, కొననుంచి కాడప్పికి వేరుచేశాడు. రెండుప్రక్కలఉన్న పాయల్లో ఒకటి పావుచేసి చాపమీద పెట్టి మిగతా పొగాకు బారుగా సాగదీసి, తుంపులుతుంపులుగాచేసి, పాయలో పొదిచేసి పెట్టి చుట్టచుట్టాడు. ఆ జేబులోంచి అగ్గిపెట్టతీసి పుల్లలాగి, వెలిగించి, రెండువేళ్ల మధ్య చుట్ట నోట్లో పెట్టుకొని బుగ్గలు చొట్టలు పడేట్టుగా, రెండుప్రక్కలనుంచి చెంపలు పట్టుకారుతో ఒత్తిపట్టినట్లు లోపలికిపోయేట్లు పొగ పీల్చి గవదలు ఉబ్బించి పొగ వదిలిపెట్టాడు రాంకోటి. పొగ తాపీగా వదులుతూ ఎదురుగా అల్లంతదూరంలో ఉన్న గుంటవైపు చూస్తున్నాడు.

కాళ్లు అరజాపి, మోకాటిచిప్పలు చేత్తో రుద్దుకొంటూ కుతిదీరా చుట్ట కాల్చుకొంటున్నాడు. రాంకోటి పొట్టిగా గిడసబారి ఉన్నాడు. కళ్లు చిన్నవి. కనురెప్పలపై వెంట్రుకలున్న జాడలేదు బోణతలమీద వెంట్రుకలు అక్కడొకటి, ఇక్కడొకటి వున్నాయి. తల నున్నగా లేదు కాళీకాళీగా తెల్లవెంట్రుకలు చెదురు మదురుగా వున్నాయి. చెంపలు ఎండి ముడతలుపడి పెళుసుగా ఉన్న తమలపాకులు లాగున్నాయి. రెండు పెదవులు కలిసే రెండు చోట్ల రెండు రైలింజన్లు ఢీకొంటే పట్టాలు చెక్కలు వంకర్లు తిరిగిపోయినట్లు ముడుతలున్నాయి. ఆ ముడుతలపైన పడేసి వెంట్రుకలు బారుగా క్రిందికి చూస్తూ వెండిదారాలు అతికించినట్లు మీసాలున్నాయి. పై పెదవిమీద, ముక్కుక్రింద పెదవి కొసదాకా వెంట్రుకలు లేవు అక్కడ నున్నగా వుంది నూనె రాసిన లేత తమలపాకు మెరిసినట్లుగా మెరుస్తూవుంది. ముక్కు రంధ్రాల లోపల వెంట్రుకలు లేవు. వెంట్రుకల పొదుల ఉనికి కూడా లేదు. జోడుగుళ్ల తుపాకీ బేరల్స్ మెరిసినట్లు మెరుస్తున్నాయి ముక్కుగోళ్లు, లోపలిభాగాలు. చాపముందు విడిచిన అరిగి పీలికలయిన చెప్పులు ఉంగటాలు తెగి వికృతంగా వున్నాయి. చేతివేళ్లు ఆకారానికి మించినంత బారుగా వున్నాయి.

మునసబు కొడుకు మునసబు, కరణం కొడుకు కరణం, వెట్టివాడి కొడుకు వెట్టివాడు అయినట్లు రాంకోటి కొడుకు రాంకోటి—తండ్రి తర్వాత పొలం పుట్రా నగానట్రా ఇల్లూవాకిలీ మళ్లూ మాన్యాలు కొడుకు సంరక్షించుకొన్నట్లు, అవ్వ ఆభరణాలు తల్లికి, తల్లి సొమ్ములు కూతురుకు, కూతురు నగలు కూతురు కూతురుగా తరతరాలనుంచి సంక్రమించినట్లు, తద్దినాలు పెట్టే తండ్రి కొడుకు తద్దినాలు పెట్టినట్లు, వ్యాపారి కొడుకు వ్యాపారం నిలబెట్టుకొన్నట్లు వంశపారంపర్యంగా వస్తున్న ఆస్తినీ, హక్కునూ—నిలబెట్టుకొన్నాడు.

రాంకోటి వయస్సు అరవై దాటింది. అతనికి ముగ్గురు కొడుకులు. పెద్దవాళ్లిద్దరూ తండ్రి అంతటివాళ్ళు కాలేదు. ఏదో చదువు మిణికారు. చాలీచాలని జీతాలతో చచ్చే చావు జస్తూ ఉద్యోగాలంటూ వెలగబెడుతున్నారు. వాళ్ళ సంసారాలు పిల్లా జెల్లా, ఏవో బాధలు పడుతున్నారు. చిన్నవాడికి చదువు అబ్బ లేదు అందుకే రాంకోటి అయ్యాడు. పెద్దరాంకోటి పలుకుబడి వల్ల చిన్నరాంకోటి కీపాటి ఉద్యోగం అయినా చిక్కిందిగాని లేకపోతే అందుకూ పనికిరాని ఆటకాయతనం ఉన్న రాలుగాయి! పెద్దరాంకోటికి ఆడపిల్లలు లేరు ఇద్దరు కోడళ్ళు పెద్దవాళ్ళు కాపరానికి వచ్చినట్లేవచ్చి వెళిపోయారు భర్తల వెంట బాధ్యతలు మోసుకొంటూ. చిన్నకోడలు ఇంట్లోనే వుంది అత్తమామలను నమ్ముకొని. చిన్నకోడలే పెద్దరాంకోటికి కూతురులేని లోపం తీర్చింది. చిన్నరాంకోటికి ఇంకా పిల్లలు కలగలేదు.

కాలం ఎంత ముందుకు పోయినా, పోకపోయినా, పట్టణానికొక రాంకోటి పదిలంగా ఉంటాడు. జబ్బుచేసిన నగరానికి, చీడ పట్టిన వీధులకు, ప్రతియింట వెలుపల తూగుతున్న జాతికి పరిచర్య చేసేందుకు బస్తీల్లో, పట్టణాలలో, నగరాలలో, అమ్మలాగో, అక్కలాగో, అత్తలాగో, కోడలులాగో, భార్యలాగో నర్సులాగో, అందరి ఏకరూపంలాగో, స్త్రీ కాని రాంకోటి స్త్రీ లాగా మారి వుంటాడు. రాజులు మారిపోయి, రాజ్యాలు మారిపోయి ప్రజలే రాజులయి, ప్రభుత్వాలే ప్రజలయినా కావచ్చు ఏది ఏమయినా కావచ్చు కాని మానవజాతి మనుగడ వున్నంతవరకు రాంకోటి మారడు ఒక రాంకోటి కాకపోతే మరో రాంకోటి. ఇంకో రాంకోటి వేరో రాంకోటి! రాంకోటి శాశ్వతం! రాంకోటి నిరంతరం! రాంకోటి కలకాలం! రాంకోటి చిరంజీవి!

మొదటి లారీ వచ్చింది. ఆ పాటికి చుట సగం కాలిపోయింది నోట్లో ఉన్న కొసకొరికి, ఉమ్మివేసి, కాలుతున్నప్రక్క నుసిరాల్చి, వేలమీదరాసి, ఆరిపోయిం తర్వాత చెవిలో దోపుకొన్నాడు రాంకోటి. పెద్దరాంకోటి లారీతో వచ్చిన చిన్నరాంకోటిని చూశాడు వెలుపలికి వచ్చి. లారీ ఆగింది.

'ఏరా తెచ్చా?'

'ఆఁ!'

